మొక్కల సంరక్షణపై శ్రద్ధ

- నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు
- ప్రతీరోజు నీటిని అందిస్తున్న వనసేవకులు
- మండల వ్యాప్తంగా 1.50 లక్షల మొక్కల పెంపకం



మొక్కలకు అందిస్తున్న నీటి తడులు



మొక్కలకు ఏర్పాటు చేసిన చలువ పందిరి

తాంసి: తొమ్మిదో విడుత హరితహారానికి గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున మొలకెత్తిన విత్తనాలు, మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈఏడాది హరితహారంలో భాగంగా మండలంలో 1.50 లక్షల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. అయితే మొక్కల పెంపకంలో భాగంగా కవర్లలో విత్తనాలు నాటాగా.. మొక్కలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. మొక్కలు ఎండిపోకుండా ప్రతీరోజు నీటి తడులు అందిస్తున్నారు. మొక్కలకు నీడ కోసం గ్రీన్ మ్యాట్‌తో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటిని అందిస్తున్నారు.

13 నర్సరీల్లో 1.50 లక్షల మొక్కల పెంపకం..

మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామానికి ఒకటి చొప్పున 13 నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామంలో మొక్కల సంరక్షణకు వన సేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల మధ్య పెరిగిన కలుపును ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అలాగే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మొలకెత్తని విత్తనాలను తొలగించి ఇతర మొక్కలు పెడుతున్నారు. పూలు, పండ్లు, ఇతర మొక్కలను పంచాయతీల్లోని నర్సరీల్లో విరివిగా పెంచుతున్నారు. నర్సరీ నిర్వహణకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిధులను ఖర్చు చేస్తూ ముమ్మరంగా పనులు చేపడుతున్నారు.

అన్నిరకాల మొక్కలు..



హరితహారం మొక్కలు పెంచేందుకు ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటు చేశాం. నర్సరీల్లో 11వేల వరకు వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాం. ప్లాస్టిక్ సంచులలో విత్తనాలు వే యగా కొన్ని ఇప్పటికే మొలుస్తున్నాయి. ఎండకు మొక్కలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– అలాలి జ్యోతి, హస్నాపూర్ సర్పంచ్

చలువ పందిళ్ల ఏర్పాటు



హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రతీ గ్రామంలో అవసరమైన మొక్కలను నర్సరీలో పెంచుతున్నాం. మండల వ్యాప్తంగా 13 నర్సరీలో 1.50 లక్షల మొక్కలు పెంచుతున్నాం. మొక్కలు దెబ్బతినకుండా గ్రీన్‌మ్యాట్‌తో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం.

– ఆకుల భూమయ్య, ఎంపీడీవో

క్లుప్తంగా

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి హిమబిందు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ సబ్‌సెంటర్‌లో సోమవారం గర్భిణులకు నర్సాపూర్ వైద్యాధికారి హిమబిందు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సఖీ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అడ్మినిస్ట్రేటర్ సరస్వతీ

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ కోలాం బాలుర పాఠశాలలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అభ్యర్థులకు సేవలపై అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతీ, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర సఖీ అందించే సేవల గురించి వివరించారు. ఫోక్సో, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, గృహ హింసా చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఆపద సమయంలో 100, 181, 198కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామ్రేడ్ నందు మృతి తీరని లోటు



నందు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విలాస్

జైనథ్: సీపీఐ జిల్లా మాజీ కౌన్సిల్ సభ్యుడు కామ్రేడ్ నందు మృతి పార్టీకి, శ్రామిక వర్గానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు విలాస్ అన్నారు. సోమవారం మండలంలోని పెండల్‌వాడలో ఆయన దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. నందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతులు, కార్మిక, కర్షకుల పక్షాన కామ్రేడ్ చేపట్టిన పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కుంటాల రాములు, భూపతి రెడ్డి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అందరు కలిసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్

నేరడిగొండ: అందరు కలిసికట్టుగా ఉండాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గ్రామస్తులు సహకరించాలని సూచించారు. ఇటీవల అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యువత చదువుపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఇచ్చోడ సీఐ నైలు, సర్పంచ్ రేనబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

బోథ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు లబ్ధిదారులను గ్రామ సభల్లోనే ఎంపిక చేయాలని సొనాల గ్రామ మహిళలు సోమవారం తహసీల్దార్ అతికోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తే అక్రమాలకు అవకాశం ఉండదన్నారు. కొంతమంది దళారులు దళితబంధు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లంక లలిత, మహిళలు ఉన్నారు.

'బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం'



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ హయాంలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దనోర(బి) గ్రామానికి సందర్శించి పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం పంపిణీ చేసిన కానుకలను ముస్లిం కుటుంబాలకు అందజేశారు. అనంతరం దనోర(బి) గ్రామంలోని తిరుపతికి చెందిన ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసి, ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, స్వర్ణలత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

తాంసి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జయంతి రోజున జరిగిన ఘర్షణకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో జిల్లాలో ధర్నా చేస్తున్న జిల్లా బీజేపీ నాయకులను సోమవారం ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. బీజేపీ రాష్ట్ర యువ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి మహేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, ఉమేష్ యాదవ్, అభిలాష్‌లను అరెస్ట్ చేసి తాంసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రాజేశ్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: మండలంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సోమవారం బంద్ ప్రకటించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మొత్తం 18మంది బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు రతన్‌రెడ్డి, లోక కరుణాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'నిరసన దీక్షకు తరలిరండి'



మాట్లాడుతున్న సృజన్ పాటిల్

తాంసి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో నేడు ఇందిరాపార్క్ వద్ద చేపట్టే నిరసన దీక్షకు నిరుద్యోగులు, యువకులు పెద్దఎత్తున తరలిరావాలని బీఎస్పీ బోథ్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సృజన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో యువకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. బోథ్ నియోజకవర్గం నుంచి యువత పెద్దఎత్తున పాల్గొని నిరసన తెలిపాలని కోరారు. సమావేశంలో నాయకులు సుధాకర్, ప్రశాంత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు ప్రారంభం

బోథ్: మండలంలోని కరత్వాడ గ్రామంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ సింధు విశ్వేశ్వర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుల్తానా, సూపర్‌వైజర్లు భారత, లక్ష్మి, స్వామి, గోవింద్, శశికల, సంతోశ్, స్వప్న, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్‌లో ప్రమాదకరంగా మూలమలుపు

జైనథ్ మండలంలోని నిరాల, ఖాప్రి గ్రామాలు వెళ్లే రోడ్డుపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో సింగిల్ రోడ్డుగా ఉండగా.. 2018లో రూ. 33 కోట్లతో నిరాల నుంచి ఖాప్రి వరకు డబుల్ రోడ్డు వేశారు. అయితే మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– జైనథ్

పరామర్శ

బోథ్: మండలంలోని బాబెర గ్రామానికి చెందిన ఆత్రం దిగంబర్ సోదరుడు, సాకెర సర్పంచ్ మీరాబాయి కుటుంబీకులు విజయ్‌సింగ్ ఇటీవల మృతి చెందారు. కాగా.. బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ బాధిత కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. అలాగే ధన్నూర్ గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

వంతెన నిర్మాణానికి భూమిపూజ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిరిచెల్మ వెళ్లే దారిలో రూ. 2 కోట్లతో నిర్మించే వంతెన నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమి పూజ చేశారు. వర్షకాలం వంతెన కూలి పోవడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సర్పంచ్ చౌహన్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన సీరం భూమవ్వకు చెందిన ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయింది. కాగా వైద్యులు రమేశ్‌రెడ్డి, వేణుగోపాల్‌లు బాధిత కుటుంబానికి రూ. 10 వేలతో పాటు 25 కిలోల నిత్యావసర సరుకులు అందించారు. బోథ్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము చంద్రమోహన్, వైద్యులు రాజేశ్వర్, నర్సింగ్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: బోథ్ మండలానికి మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి సోమవారం బీఎస్ఎన్ఎల్ అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. కేశవ్‌గూడ, చింతలబోరి, నక్కల వాడ, పార్ది (కె), నాగాపూర్, బాబెర, చింతగూడ గ్రామాల్లో టవర్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్ఐ సునీత తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీలు టవర్ల ఏర్పాటుకు తీర్మానం చేసి అధికారులు అందించారు. కార్యక్రమంలో డీఈ రంజిత్, జేటీవో నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభను విజయవంతం చేయండి'



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఈనెల 29, 30న నిర్వహించే ఆదివాసీ సేనా రాష్ట్ర తృతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆదివాసీ సేనా నాయకులు కోరారు. మండలంలోని రాఘాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో పోస్టర్ విడుదల చేశారు. ఆదివాసీ విద్యార్థి సేనా జిల్లా కన్వీనర్ కుంభ్రం చత్రుఘన్, ఆదివాసీ కార్మిక సేనా జిల్లా కన్వీనర్ మడావి లాల్‌షావ్ మాట్లాడుతూ.. ఆదివాసీల మనుగడ కోసం చేస్తున్న ఉద్యమానికి ఆదివాసీలు ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్, అమూల్, మారుతీ, పవన్, శ్రీను, శంకర్, తులసీరాం, సంభు, సుంగు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

రోడ్డుపై గుంతలు..



నేరడిగొండ: గతుకుల రోడ్డుపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్లే ఎన్‌హెచ్- 7 జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: అరవింద్, ఆర్అండ్‌బీ, ఏఈఈ, ఫోన్: 94906 12770

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు

తాంసి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీటీసీ రాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండలంలోని కప్పర్ల గ్రామంలోని రైతువేదికలో తాంసి, భీంపూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాంసి, భీంపూర్ ఎంపీడీవోలు భూమయ్య, శ్రీనివాస్, ఎంపీవో సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు సదానంద్, వెంకన్న, రాజు, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జావిద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

ఇచ్చోడ: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామ రక్ష అని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విఠల్‌రెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు చేరాయన్నారు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మోహరాజ్ అహ్మద్, సుభాష్‌పటేల్, ముస్తాఫా, కిరణ్, గణేష్, రాథోడ్ ప్రవీణ్, వెంకటేశ్, దాసరి భాస్కర్ పాల్గొన్నారు.

20న అమరుల సంస్మరణ దినం



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడి 1981లో పోలీసుల కాల్పుల్లో అమరులైన ఆదివాసీ అమవీరుల సంస్మరణ దినం ఈనెల 20న నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు. సోమవారం అమరవీరుల స్తూపం ప్రాంగణంలో బ్లేడ్ ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు. అమరవీరుల స్తూపానికి రంగులు వేశారు.

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద ఈనెల 20న నిర్వహించే ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినం విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం అమరులకు నివాళులర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, కనక తుకారం, పుర్క బాపురావ్, పెందోర్ పుష్పరాణి, సోయం రాందాస్, తోడసం నాగోరావ్, జుగ్నాక్ భరత్, పుర్క చిత్రు, పెందోర్ మానిక్‌రావ్ పాల్గొన్నారు.

కేఆర్‌కే కాలనీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: కేఆర్‌కే కాలనీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం కాలనీలో పర్యటించిన రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. మహిళలతో మాట్లాడి తాగు నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల ద్వారా మసీదు వెనకాల నివాసముండే నిరుపేదల నీటి కష్టాలు తొలగుతాయన్నారు. గత పాలకుల హయంలో నిర్లక్ష్యానికి గురైన కేఆర్‌కే కాలనీకి స్వరాష్ట్రంలో తొలి ప్రాధాన్యతతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. దశల వారీగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఉద్యోగులు, ముస్లింలు

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి పి.రాజశేఖర్, ఎఫ్‌డీవో బర్నోబాలు పాల్గొన్నారు. తొలుత మైనార్టీ ఎంప్లాయీస్ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి తమ ఉపవాసాన్ని విరమించారు. ఎఫ్ఆర్‌వోలు గులాబ్ సింగ్, పాండురంగ్, గులామ్ మోయినోద్దీన్, వహాబుద్దీన్, డిప్యూటీ ఆర్‌వోలు షరీఫ్, గీరయ్య, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి విందు స్వీకరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, మాజీ ఎంపీపీ కుమ్మరి సత్యరాజ్, జలంధర్, సలీం, సింధే రాము, బేగ్ సాహబ్ పాల్గొన్నారు.